సాక్షి జగిత్యాల

7

మంగళవారం, 3, అక్టోబర్, 2023







క్లుప్తంగా

సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన



ధర్మపురిలో సభాస్థలి, పైలాన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీ

ధర్మపురి: ధర్మపురిలో మంగళవారం కేటీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో సభాస్థలి ఏర్పాట్లను సోమవారం రాత్రి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత పర్యవేక్షించారు. మాతాశిశు సంరక్షణకేంద్రంతోపాటు, పైలాన్ ఆవిష్కరణకు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆయన వెంట కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న తదితరులున్నారు.

గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్, సిబ్బంది

జగిత్యాల: మహాత్మగాంధీ ఆశయాలు, ఆదర్శాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింస, శాంతిమార్గంలో నడవాలన్నారు. అదనపు కలెక్టర్లు లత, దివాకర, సంక్షేమాధికారి సాయిబాబా, డీపీఆర్వో భీంకుమార్ పాల్గొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలు పాటించాలి



నివాళి అర్పిస్తున్న ఎస్పీ ఎగ్గడి భాస్కర్

జగిత్యాలక్రైం: గాంధీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మహాత్మాగాంధీ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ సూచించిన శాంతి, అహింస మార్గంలో ముందుకుసాగాలని సూచించారు. దేశానికి నిస్వార్థ సేవలందించాలని కోరారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు వెంకటస్వామి, సురేశ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు

ధర్మపురి: భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురిలోని యమధర్మరాజు ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ముత్యాలశర్మ స్వామివారికి రుద్రాభిషేకం, మన్యుసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆయుష్యహోమం హారతి, మంత్రపుష్పం పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని మహాగణపతికి సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



నెరవేరనున్న పేదల కల

- నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు..
- ముస్తాబైన డీపీవో, సమీకృత మార్కెట్ సముదాయం
- నేడు ప్రారంభించనున్న మంత్రి కల్వకుంట్ల తారకరామారావు



ప్రారంభానికి సిద్ధంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు



జిల్లాకేంద్రంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో మంగళవారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. మల్యాల మండలం నూకపల్లిలో రూ.280 కోట్లతో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మొదటి దశలోభాగంగా 3,722 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా రూ.38.04 కోట్లతో నిర్మించిన పోలీసు ప్రధాన కార్యాలయం, రూ.4.50 కోట్లతో నిర్మించిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి రూ.8.50 కోట్లతో నిర్మించిన మాతాశిశు కేంద్రం పైలాన్‌ను ప్రారంభించనున్నారు. గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించనున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు.

ప్రగతిలో జిల్లా..

జగిత్యాల జిల్లాకేంద్రంగా మారిన అనంతరం జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కలెక్టరేట్ అందుబాటులోకి వచ్చింది. వైద్య కళాశాలతోపాటు, నర్సింగ్ కళాశాల ప్రారంభమయ్యాయి. తాజాగా పేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లతోపాటు, డీపీవో కార్యాలయం కూడా అందుబాటులోకి రానున్నాయి.

గులాబీమయం

మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఇప్పటికే కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సమీకృత మార్కెట్, డీపీవో కార్యాలయం వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు జిల్లాకేంద్రంలోని చౌరస్తాలను ఫ్లెక్సీలు, తోరణాలతో నింపేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

సభస్థలి పరిశీలన

మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అధికారులు సభాస్థలిని సోమవారం పరిశీలించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

కేటీఆర్ సభకు భారీ

ధర్మపురి: పట్టణంలో రూ.8.05 కోట్లతో నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. రూ.100 కోట్లతో అభివృద్ధి పనుల శిలాఫలకాలు ఆవిష్కరిస్తారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం, సర్దార్ వల్లాభాయిపటేల్ విగ్రహాన్ని ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని 3000 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగులు పంపిణీ చేస్తారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతారు.

కేటీఆర్ పర్యటన ఇలా...

- ఉదయం 8.50 గంటలకు హైదరాబాద్‌లోని క్యాంప్ ఆఫీసు నుంచి బయల్దేరి 9 గంటలకు బేగంపేటకు చేరుకుంటారు.
- హెలికాప్టర్‌లో 10 గంటలకు జగిత్యాలలోని కలెక్టర్ కాంప్లెక్స్‌కు చేరుకుంటారు.
- అక్కడి నుంచి కారులో వెళ్లి ముందుగా డీపీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- అనంతరం నూకపల్లిలోగల డబుల్‌బెడ్ రూం ఇళ్లను ప్రారంభిస్తారు.
- ధరూర్‌క్యాంపులో నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రారంభిస్తారు.
- 11.30 గంటలకు మినీస్టేడియంలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారు.
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ధర్మపురి చేరుకుంటారు.
- అక్కడ మాతాశిశు సంరక్షణ కేంద్రంతోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం 1.30 గంటలకు పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు.
- అక్కడి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్తారు.



జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు: డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాలక్రైం: మంత్రి కేటీఆర్ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించామని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ నుంచి కోరుట్ల వైపు వెళ్లే వాహనాలు పెద్ద కెనాల్ బైపాస్ ద్వారా, ధర్మపురి నుంచి కోరుట్ల, కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు పొలాస నుంచి తిమ్మాపూర్ మీదుగా, బైపాస్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. కోరుట్ల నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలను చల్‌గల్ బైపాస్ మీదుగా మళ్లించామన్నారు. పట్టణంలో పాతబస్టాండ్ నుంచి గొల్లపల్లి వైపు చిన్నకెనాల్ బైపాస్ మీదుగా వెళ్లాలని సూచించారు.

వాహనాల పార్కింగ్ ఇలా..

కరీంనగర్, మల్యాల, కోరుట్ల, రాయికల్ నుంచి వచ్చే వాహనదారులు న్యూబస్టాండ్ మీదుగా వచ్చి ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలను దింపి మిషన్ కాంపౌండ్, ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలని డీఎస్పీ సూచించారు. ధర్మపురి, సారంగాపూర్ నుంచి వచ్చేవారు ఓల్డ్ బస్టాండ్‌లో ప్రజలను దింపి మిషన్ కాంపౌండ్, ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని సూచించారు. గొల్లపల్లి వైపు నుంచి వచ్చే వాహనదారులు గొల్లపల్లి బైపాస్ ఎక్స్‌రోడ్ వద్ద ప్రజలను దింపి మోతె టీఆర్ఎస్ ఆఫీస్ పక్కన పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.



విద్యుత్‌కాంతులతో జిగేల్‌మంటున్న జిల్లాకేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయం

జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ

- పాల్గొన్న జిల్లా న్యాయమూర్తులు

జగిత్యాలజోన్: జిల్లా జైలులో సోమవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ హాజరయ్యారు. జైలు జీవితం ఓ గుణపాఠం కావాలని, బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మొదటి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ జితేందర్ మాట్లాడుతూ పదేపదే నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. జైలర్ మొగిలేశ్ మట్లాడుతూ ఖైదీలను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఖైదీలకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, లీగల్ ఎయిడ్ న్యాయవాది కటుకం చంద్రమోహన్, హెడ్ వార్డర్ మజారొద్దీన్ పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీరు



కాకతీయ మెయిన్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ మెయిన్ కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 14,588 క్యూసెక్కుల వరద నీరు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండడంతో ఎగువ నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లే విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తికి 5 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300 క్యూసెక్కులు, గుత్ప ఆలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, వరద కాల్వకు 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ కోసం 152 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

‘గ్యారంటీ పథకాలు’ ప్రజలకు వివరించాలి

- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించి.. అమలు చేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం విద్యుత్ అంశాన్ని వ్యాపారమయం చేసిందని ఎద్దేవా చేశారు. మండలంలోని పెంబట్లలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సోమవారం సమావేశం అయ్యారు. తెలంగాణకు విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందన్న ఆలోచనతో సోనియాగాంధీ రాష్ట్రానికి 52 శాతం వాటా కేటాయించారని గుర్తు చేశారు. 4వేల మెగావాట్ల విద్యుత్ వినియోగ అవకాశాన్ని రాష్ట్రప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందన్నారు. 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.50 వేల కోట్లతో యాదాద్రిలో విద్యుత్ ప్లాంట్ నిర్మిస్తున్నారని, సీఎం కేసీఆర్ కమీషన్ల కోసం ప్రజలపై అదనంగా రూ.50వేల కోట్ల భారం మోపుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, తనకు ఒక్క ఓటువేసి గెలిపిస్తే ఐదు సంవత్సరాలు మీ సేవకుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు బొడ్డుపల్లి రాజన్న, తాటిపర్తి దేవేందర్‌రెడ్డి, బొడ్డుపల్లి రాజన్న పాల్గొన్నారు. ముందుగా పలు పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మల్యాల శ్రీనివాస్, పాలగాని మల్లేష్, పల్లపు రాజం, కందుల శంకర్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

పదోన్నతుల్లో గందరగోళం తొలగించాలి

- యూటీఎఫ్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించి.. ప్రక్రియ సజావుగా నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ అన్నారు. కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. జీవో నంబరు 15 ద్వారా స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేసిన 10,479 భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు హైకోర్టు తీర్పు ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా అప్‌గ్రేడ్ చేసి సవరించిన సర్వీస్ నిబంధనల జీవో నంబర్లు 2, 3 ప్రకారం భాషా పండితులకు జీవో నంబరు 9, 10 ప్రకారం పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

కేటీఆర్ సభ కోసం ప్రజలను భయపెడతారా..?

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: కేటీఆర్ బహిరంగ సభకు రావాలని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో అధికార దుర్వినియోగం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వెల్గటూర్ మండలంలోని పలువురికి ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. పట్టణ అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరైనట్లు చెబుతున్నా.. ఎన్ని ఖర్చు చేశారో చెప్పాలని డిమాండు చేశారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధిపై వివక్ష ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. దివంగత మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో చేసిన అభివృద్ధే తప్ప.. బీఆర్ఎస్ ఏమీ చేయలేదన్నారు. నాయకులు సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, అశెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య..?

- కూతురు పెళ్లి విషయంలో భార్యాభర్తల ఘర్షణ..?
- ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకుని మృతి



గుండ కవిత (ఫైల్)

మల్లాపూర్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన గుండ కవిత, నరసింహులుకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు సంతానం. డిగ్రీ చదువుతున్న కూతురుకు పెళ్లి చేయాలని నరసింహులు.. చదువుకోనివ్వాలని కవిత ఆదివారం రాత్రి గొడవపడ్డారు. తీవ్ర వాగ్వాదం జరగడంతో మనస్తాపం చెందిన కవిత సోమవారం వేకువజామున ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలకు తాళలేక కేకలు వేయడంతో భర్త నరసింహులు, స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే కవిత మృతి చెందింది. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో ఘటనస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అయితే కవిత మృతిపై అనుమానం ఉందని ఆమె తండ్రి తులసీరాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కేసుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధుడి మృతి

వెల్గటూర్: ఎస్సారెస్పీ కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ముక్కట్రావుపేటలో సోమవారం వెలుగుచూసింది. ఎస్సై శ్వేత కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పుల బక్కయ్య సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. ప్రస్తుతం స్వగ్రామంలోనే ఉంటున్నాడు. ఆదివారం ఇంట్లోంచి బయటకు వెళ్లిన బక్కయ్య అర్ధరాత్రి అయినా ఇంటికి రాలేదు. సోమవారం మధ్యాహ్నం ఎస్సారెస్పీ కెనాల్‌లో శవమై కనిపించాడు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సారంగాపూర్: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బోనగాని రవి సోమవారం తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. రోజు మాదిరిగానే కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కగా మోకు తెగిపోయింది. దీంతో కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రవిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ రవి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రం శివారులో జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన తోట సురేశ్ (54) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లికి చెందిన తోట సురేశ్ ఆదివారం పనినిమిత్తం జగిత్యాలకు వచ్చాడు. రాత్రి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలు కాగా.. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.



సురేశ్ (ఫైల్)